teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్


నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 175 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | సోమవారం | 21 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## తెలంగాణలో కొనసాగుతున్న వర్షాలు

### వాయుగుండంగా మారనున్న అల్పపీడనం



హైదరాబాద్, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర అండమాన్ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని దాని ప్రభావంతో రాగల 24గంటల్లో తూర్పు మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 22 నాటికి పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ బలపడి వాయుగుండంగా మారుతుందని పేర్కొంది. 23వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై తుఫానుగా మారుతుందని పేర్కొంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది.



## జీవో 317పై వేగం పెంచిన కేబినెట్ సబ్ కమిటీ

### కమిటీ రూపొందించిన నివేదిక పత్రాలను సీఎంకు అందజేత

హైదరాబాద్, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): జీవో 317పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ వేగం పెంచింది. కమిటీ రూపొందించిన నివేదిక పత్రాలను సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అందజేసింది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సభ్యులు, మంత్రులు

మిగతా 2 లో



## గ్రూప్-1 మెయిన్స్ వివాదంపై స్పందించిన టీపీసీసీ చీఫ్

### నిరుద్యోగులు విపక్షాల ట్రాప్‌లో పడొద్దు
### జీవో నెం 29తో అభ్యర్థులకు నష్టం జరగదని క్లారిటీ

హైదరాబాద్, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారిన గ్రూప్-1 మెయిన్స్ వివాదంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. ఆదివారం (అక్టోబర్ 20) గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగులు

మిగతా 2 లో



# పకడ్బందీ ఏర్పాట్ల మధ్య గ్రూప్ 1 పరీక్ష

### ఒక్కో పరీక్ష కేంద్రం వద్ద ఎస్పైల నేతృత్వంలో ప్రత్యేక బృందాలు

### అదనంగా పోలీస్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం... వాహనాలకు తొలిసారిగా జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ

**తెలంగాణలో 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి ఈ నెల 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల కోసం హైదరాబాద్ పోలీసులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలను వాయిదా వేయాలంటూ అభ్యర్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాల తరలింపులో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.**



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్):హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఒక్కో పరీక్ష కేంద్రం వద్ద ఎస్పైల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. వీరికి అదనంగా పోలీస్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తరచూ సందర్శిస్తుంచనుంది. పరీక్షల పర్యవేక్షణకు 3 కమిషనరేట్లలో ఒక్కో డీసీపీని నోడల్ అధికారిగా నియమించారు. హైదరాబాద్ పరిధిలో మొత్తం 46 కేంద్రాల్లో 31,383 మంది అభ్యర్థులు పరీక్షలకు

మిగతా 2 లో

## రాష్ట్ర ప్రజలపై కాంగ్రెస్ పార్టీ నాయకుల కపట ప్రేమ

### కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన హరీష్ రావు



**మల్లన్న, కొండపొచమ్మ సాగర్ బాధితులపై ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కపట ప్రేమ చూపిస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హరీష్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు.**

సిద్దిపేట జిల్లా, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): మల్లన్న సాగర్, కొండపోచమ్మ బాధితులకు పాత ఇళ్లకు రూ. 694 కోట్లు , ఇంటి యజమానికి ఉపాధి కింద రూ. 7 లక్షల 50వేలను బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చామని గుర్తు,చేశారు. అన్ని వసతులతో కూడిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇచ్చామని స్పష్టంచేశారు. పెళ్లికాని పిల్లలకు 250 గజాల ఖాళీ స్థలం, రూ 5 లక్షలు ఇచ్చామని గుర్తుచేశారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లను గజ్వేల్ పట్టణ నడిబొడ్డున ఇచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హైదరాబాద్‌లో మూసీ దగ్గర ఉన్న ఇళ్లను కూల్చివేసిందని అన్నారు. ఆ బాధితులకు మాజీ సీఎం కేసీఆర్ కట్టించిన

మిగతా 2 లో

## తెలంగాణను ట్రిలియన్ డాలర్లకు మార్చడమే లక్ష్యం

### గచ్చిబౌలిలో ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమ్మిట్
### ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు



హైదరాబాద్, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ గచ్చిబౌలిలో ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమ్మిట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఐఎస్‌బీ ప్రాంగణంలో రేవంత్‌రెడ్డి మొక్కను నాటారు. ఐఎస్‌బీ విద్యార్థులు కొత్త ఇండియాకు అంబాసిడర్లు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్లకు మార్చడమే తమ లక్ష్యమని, హైదరాబాద్‌ను 600 బిలియన్ డాలర్ల నగరంగా మార్చాలన్నారు. అంతర్జాతీయ నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలని తెలిపారు. హైదరాబాద్‌ను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని.. స్కిల్, స్పోర్ట్స్ వర్సిటీలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు.

## డిజిటల్ క్రాప్ సర్వేకు వ్యతిరేకంగా ఏఈఓల గళం

### రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోల సమావేశం
### సమస్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): డిజిటల్ క్రాప్ సర్వేకు వ్యతిరేకంగా అగ్రికల్చర్ ఎక్సటెన్షన్ ఆఫీసర్లు గళమెత్తారు. శామీర్ పేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో అత్మీయ సమ్మేళనం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏఈవోలు సమావేశమై తమ సమస్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా ప్రభుత్వం చేపట్టమన్న డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టలేమని వ్యవసాయ విస్తరణ అధికారులు తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ఏఈవో సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మేము ఉద్యోగంలో చేరిన గడిచిన 7 సంవత్సరాలలో అనేక వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, రైతు బంధు, రైతు భీమా అమలు, రైతు వేదికల నిర్మాణాలు అమలు చేశామని గుర్తు చేశారు. పంటల పరిశీలన సర్వేకు వెళ్ళే ఏఈవోలకు

మిగతా 2 లో





## చికెన్ బిర్యానీలో కప్ప కలకలం

### ట్రిపుల్ ఐటీలోని మెస్‌లో ఘటన
### బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలోని మెస్‌లో వడ్డించిన చికెన్ బిర్యానీలో కప్ప కనిపించడం కలకలం రేపింది. బిర్యానీలో కప్పను చూసిన విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే మెస్ ఇంఛార్జీకి ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

## రైతు భరోసాపై గులాబీ శ్రేణులు, రైతుల ఆందోళనలు

### నిరసనలో కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం



.. వివరాలు 2లో

## త్వరలో హైదరాబాద్ నుండి యాదాద్రికి ఎంఎంటిఎస్

### స్థానికంగా అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం
### కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): రూ. 430 కోట్లతో కొనసాగుతున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మాణ పనులను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ అమృత్ పథకంలో

మిగతా 2 లో

## గ్రూప్ 1 అభ్యర్థులకు మద్దతుగా కేంద్ర మంత్రి బండి ఆందోళన

**ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు**

**జీవో నెం 55న అమలు చేయాని డిమాండ్ చేస్తూ ర్యాలీ**

**తెలుగుతల్లి ఫ్లైఓవర్ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు**




హైదరాబాద్, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనకు మద్దతుగా బండి సంజయ్ ఆందోళనకు దిగారు. చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చారు. జీవో నెంబర్ 29ని రద్దు చేసి

మిగతా 2 లో

# పకడ్బందీ ఏర్పాట్ల మధ్య గ్రూప్ 1 పరీక్ష





మొదటి పేజీ తరువాయి

హాజరుకానున్నారు. ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాలు తరలించే వాహనాలకు తొలిసారిగా జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఉపయోగించనున్నారు. వీటిని టీజీపీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారు. టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్ రెడ్డి పరీక్షల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మధ్యాహ్నం 12.30 నుంచి అభ్యర్థుల్ని పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. 1.30 తర్వాత గేట్లు మూసివేయనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

**మరోసారి ఉద్రిక్తత**

ఇటు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అశోక్‌నగర్‌లో గ్రూప్ 1 అభ్యర్థులు రోడ్డెక్కారు. పెద్ద సంఖ్యలో రోడ్డు పైకి చేరుకున్న నిరుద్యోగులకు.. ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇస్తున్నాయి. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని.. జీవో 29ని రద్దు చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనలతో ట్రాఫిక్ జామ్ అయ్యింది.

**మంత్రుల సమాలోచనలు**

గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో శనివారం మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో పలువురు మంత్రులు భేటీ అయ్యారు. గ్రూప్ 1 పరీక్షలు, జీవో 29 అంశం, గ్రూప్ 1 అభ్యర్థులు చేస్తున్న విజ్ఞప్తులు, అభ్యంతరాలు, సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, విద్యార్థులు అందరికి న్యాయం జరిగేలా చర్యలు, ఏ ఒక్క అభ్యర్థి నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై లోతుగా ఉన్నతాధికారులతో సమాలోచనలు చేశారు.

**సుప్రీంకోర్టుకు**

గ్రూప్ 1 పరీక్షలపై అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై రేపు(సోమవారం) విచారణ జరిగనుంది. అయితే కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే హైకోర్టులో అభ్యర్థులకు ఊరట దక్కలేదు. పరీక్షలు ప్రారంభం రోజే కోర్టు విచారణ ఉండటంతో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల విషయంలో ఏం జరగబోతుందనేది హాట్ టాపిక్ గా మారింది.

## జీవో 317పై వేగం పెంచిన కేబినెట్ సబ్ కమిటీ



మొదటి పేజీ తరువాయి

డి.శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పలువురు మేధావులతో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయాలను వినతుల రూపంలో ప్రత్యక్షంగా, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను కేబినెట్ సబ్ కమిటీ స్వీకరించింది. సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ వివిధ శాఖల ఉన్నతాధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించి తుది నివేదిక పత్రాలను రూపొందించింది. ఈ నివేదిక పత్రాలను ఈ రోజు సీల్డ్ కవర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి అందజేసింది.

## గ్రూప్-1 మెయిన్స్ వివాదంపై స్పందించిన టీపీసీసీ చీఫ్

మొదటి పేజీ తరువాయి



విపక్షాల ట్రాప్‌లో పడొద్దని సూచించారు. జీవో నెం 29పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, జీవో నెం 29తో రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులకు ఎలాంటి నష్టం జరగదని క్లారిటీ ఇచ్చారు. ఎందరో నిపుణులతో చర్చలు జరిపిన తర్వాతే జీవో నెం 29 తీసుకువచ్చామని స్పష్టం చేశారు. జీవో నెం 29తో విద్యార్థులకు నష్టం లేదని తెలుసుకున్నాకే ఇక్కడికి వచ్చి మాట్లాడుతున్నానని అన్నారు. గ్రూప్-1 విషయంలో విపక్షాలది అనవసర రాద్ధాంతం అని అభ్యర్థులను తప్పుదోవ పట్టించి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుమ్మక్కై అభ్యర్థులను రెచ్చగొడుతున్నాయని సీరియస్ అయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని అందులో భాగంగానే నిరుద్యోగుల జీవితాలతో రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌కు ఫక్తు రాజకీయాలే కావాలనే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 పరీక్షలు ఇప్పుడు వాయిదా పడితే మళ్లీ ఎప్పుడు జరుగుతాయో తెలియదని.. పరీక్ష రాసేందుకు వేల మంది అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఏ ఒక్క అభ్యర్థికి అన్యాయం జరగనివ్వమని భరోసా ఇస్తున్నాం. సీఎం, మంత్రులతో మాట్లాడాకే నేను ఈ వ్యాఖ్యలు చేస్తున్నానని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి గ్రూప్-1 నిర్వహించిన పాపాన పోలేదని ఇప్పుడు నిరుద్యోగుల గురించి మాట్లాడుతున్నారని నిప్పులు చెరిగారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పట్టుమని 70 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రధాని మోడీ హామీ ఏమైందో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## డిజిటల్ క్రాప్ సర్వేకు వ్యతిరేకంగా "ఏఈఓల" గళం

మొదటి పేజీ తరువాయి




సహాయకులను, భద్రతను ఇవ్వాలని తాము కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. గతంలో సర్వేలు జరిగినప్పుడు వీఆర్వో, వీఆర్ఏలు తమతో పాటు ఉండేవారని, ఇప్పుడు ఒంటరిగా వెళ్ళే క్రమంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా ఏఈవోలలో అధిక సంఖ్యలో ఉన్న మహిళా ఏఈవోలకు భద్రత కరువైందని, అందుకే డిజిటల్ క్రాప్ సర్వే చేయబోమని ప్రభుత్వానికి నివేదిస్తున్నామని తెలిపారు. సహాయకులను తోడుగా నియమిస్తే డిజిటల్ క్రాప్ సర్వే చేస్తామని వెల్లడించారు.

## చికెన్ బిర్యానీలో కప్ప కలకలం

మొదటి పేజీ తరువాయి

చేశారు. బిర్యానీలో కప్ప ప్రత్యక్షం అంటూ సోషల్ మీడియాలో ఫొటోను సోషల్ మీడియాలో పంచుకోవడంతో వైరల్ అయ్యింది. అక్టోబర్ 16న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కదాంబ మెస్‌లో చికెన్ బిర్యానీ తీసుకోగా అందులో కప్ప వచ్చింది. బిర్యానీలో వచ్చిన కప్ప కళేబరాన్ని ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో విషయం బహిర్గతమైంది. ట్రిపుల్ మెస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌కు కూడా విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే బయట ఫుడ్ తినాలంటేనే ప్రజలు జంకుతున్నారు. జంట నగరాల్లోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో నాణ్యతలేని ఆహార పదార్థాలు వాడుతున్నారంటూ ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో బయటపడిన విషయం తెలిసిందే. వైన్ షాపుల వద్ద చికెన్ వంటకాలను అందించే స్టాళ్లకు సరఫరా చేసే ఓ స్టోరేజీ నుంచి సుమారు 700 కిలోల కుళ్లిపోయిన చికెన్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. నిర్వాహకులపై చర్యలు తీసుకున్నారు. మరోవైపు, జంట నగరాల్లోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో పరిశుభ్రత ఉండటం లేదని, గడువు తీరిన పదార్థాలను వాడుతున్నారని ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ హోటళ్లతోపాటు పలు ప్రముఖ హోటళ్లలోనూ పరిశుభ్రత, నాణ్యత అంతంత మాత్రంగానే ఉండటం చర్చనీయాంశంగా మారింది.

## త్వరలో హైదరాబాద్ నుండి యాదాద్రికి ఎంఎంటిఎస్

మొదటి పేజీ తరువాయి

భాగంగా స్థానికంగా ఉన్న అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రూ. 430 కోట్లతో చర్లపల్లి, రూ. 715 కోట్లతో సికింద్రాబాద్, రూ. 429 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్ పరిధిలో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడతోపాటు అదనంగా చర్లపల్లిని నాలుగో నూతన రైల్వే స్టేషన్‌గా రాబోతోందన్నారు. దీని కారణంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గుతుందన్నారు. రూ. 521 కోట్లతో కాజీపేటలో రైల్ మానిఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నుంచి యాదాద్రి(యాదగిరిగుట్ట) వరకు ఎంఎంటీఎస్ పొడిగించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన నిర్మాణ పనులు త్వరలోనే చేపడతామని కిషన్ రెడ్డి చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సదుపాయాలతో తీర్చి దిద్దుతున్నామన్నారు. ఈ పనులను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఆధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలకు అంకితం చేస్తారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

## రాష్ట్ర ప్రజలపై కాంగ్రెస్ పార్టీ నాయకుల కపట ప్రేమ



మొదటి పేజీ తరువాయి

డబుల్ బెడ్రూమ్ ఇళ్లను రేవంత్ రెడ్డి ఇప్పుడు పేదలకు పంచి గొప్పలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఎలాగైతే భూ నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కట్టి ఇచ్చినట్లుగా రేవంత్ రెడ్డి కూడా కట్టి ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. మూసీ బాధితులకు గచ్చిబౌలిలో 250 గజాల ఇల్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్లన్న సాగర్‌లో బాధితులకు కేసీఆర్ అన్యాయం చేసిండా లేక మూసీలో రేవంత్ అన్యాయం చేస్తుండా? అని అడిగారు. కేసీఆర్ ప్రభుత్వంలో 675 ఎకరాల్లో భారత దేశంలో నెంబర్ వన్ అర్ అండ్ అర్ కాలనీని తమ ప్రభుత్వంలో నిర్మించి ఇచ్చామని అన్నారు. పేదల కోసం కేసీఆర్ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కట్టి ఇస్తే.. ఇప్పుడు మూసీ బాధితులకు ఇచ్చి రేవంత్ డబ్బా కొట్టు కుంటున్నారని విమర్శించారు. మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు డబల్ బెడ్రూమ్ ఇళు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని హరీష్‌రావు మండిపడ్డారు. గజ్వేల్‌లో 3414 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కట్టి ఇచ్చినట్లు తెలిపారు. గచ్చిబౌలిలో 470 ఎకరాల్లో ఉన్నా భూమిలో మూసీ బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను రేవంత్‌రెడ్డి కట్టి ఇవ్వాలని కోరారు. 8 వేల మంది బాధితులకు 250 గజాల ఇంటి స్థలాలు ఇచ్చి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇచ్చామని వివరించారు. తాము 30 లక్షల ఇళ్లు కట్టి ఇచ్చామని.. మూసీ బాధితులకు రేవంత్ రెడ్డి ఏం ఇచ్చారని ప్రశ్నించారు. ముంపు గ్రామాల బాధితులకు రూ. 2 వేల కోట్లు కేసీఆర్ ఖర్చు పెట్టారని గుర్తు,చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది అయిన మల్లన్న సాగర్ నిర్వాసితులకు రూపాయి అయిన ఇచ్చారా అని నిలదీశారు. రేవంత్‌వి సొల్లు వాగుడు , అబద్ధాలు , గ్లోబల్స్ ప్రచారమేనని హరీష్‌రావు ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వంలో తునికి బొల్లారంలో 400 ఎకరాల్లో భూ నిర్వాసితుల కోసం ఇండస్ట్రియల్ పార్క్ కట్టామని అన్నారు. వర్గల్ మండలంలో పరిశ్రమలు రాకుండా కాంగ్రెస్ నేతలు అడ్డు పడుతున్నారని ధ్వజమెత్తారు. ఆ రోజు కోర్టుల్లో ఉండి ప్రాజెక్ట్‌లను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడేమో రూపాయి ఇవ్వకుండా కాంగ్రెస్ నేతలు గ్లోబల్స్ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మల్లన్న సాగర్ నిర్వాసితుల్లో మిగిలిన వారికి రేవంత్ ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## గ్రూప్ 1 అభ్యర్థులకు మద్దతుగా కేంద్ర మంత్రి బండి ఆందోళన



మొదటి పేజీ తరువాయి


జీవో నెం 55ను అమలు చేయాని డిమాండ్ చేస్తూ ర్యాలీగా బయలుదేరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెక్రటేరియట్‌కు వెళ్లి తీరతామని కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పుకొచ్చారు. దీంతో పోలీసులు అశోక్‌నగర్‌కు చేరుకుని భారీగా మోహరించారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌ను అడుగడుగును అడ్డుకున్నారు. చివరకు బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్ వద్ద బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలించారు. అక్కడ కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను విడిచిపెట్టి పోలీసులు వెనుదిరిగారు. గ్రూప్ వన్ అభ్యర్థులకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మద్దతు ప్రకటించారు. గ్రూప్ వన్ అభ్యర్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్ వన్ అభ్యర్థులకు మద్దతుగా చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చారు. అంతే అశోక్‌నగర్ నుంచి చలో సెక్రటేరియట్‌కు ర్యాలీగా బయలుదేరారు. చలో సెక్రటేరియట్‌కు పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. బండి సంజయ్‌ను తీసుకెళ్తున్న క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసుల వాహనాన్ని గ్రూప్-1 అభ్యర్థులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయినా సరే అభ్యర్థులను చెదరగొడుతూ బండి సంజయ్‌ను వాహనంలో నాంపల్లి బీజేపీ కార్యాలయం వద్ద వదిలిపెట్టారు.

## రైతు భరోసాపై గులాబీ శ్రేణులు, రైతుల ఆందోళనలు


మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): రైతు భరోసాపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన ప్రకటనతో తెలంగాణ వ్యాప్తంగా రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గులాబీ శ్రేణులు, రైతులు ఆందోళనలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం పర్దిపూర్ గ్రామంలో డప్పు చప్పుళ్లతో కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మ శవయాత్రను ఊరేగింపుగా నిర్వహించి రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దగ్ధం చేశారు. ఆర్మూర్ మండలం మాణిక్ బండారు చౌరస్తాలో ఖరీఫ్ పంటకు రైతు భరోస ఇవ్వటం లేదని నిరసనగా ఆర్మూర్- నిజామాబాద్ రహదారిపై రైతుల రాస్తారోకో చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు. గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని దుద్దెడ వద్ద రాజీవ్ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. మహేశ్వరంలో రైతు భరోసా వెంటనే అమలు చేయాలని కేటీఆర్ పిలుపు మేరకు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలమేరకు మహేశ్వరం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపి, అంబేద్కర్ విగ్రహానికి మెమోరాండం అందజేసి, సీఎం రేవంత్ దిష్టి బొమ్మ దహనం చేశారు. సీఎం డౌన్ సీఎం డౌన్ అంటూ బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. నల్గొండ జిల్లా చండూర్‌లోని స్థానిక చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. చేత కానీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలి అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట తెలంగాణ తల్లి విగ్రహం వద్ద.. రైతు భరోసా ఎగవేతను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు భరోసా వెంటనే ఇవ్వాలంటూ నిరసనకు దిగారు. హనుమకొండ జిల్లాలో రైతు భరోసా ఎగవేతను నిరసిస్తూ కాజీపేట చౌరస్తాలో ధర్నాకు దిగారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం మండల కేంద్రంలో రేవంత్ ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు.







# కాకతీయుల "చరిత్ర" సంస్కృతి కళా నిర్మాణం అద్భుతం

## వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ క్యాంప్ పర్యటన.. ఎన్నో నేర్పింది



వెంకటాపూర్, అక్టోబర్ 20 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామప్ప నందు వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ 2024 కార్యక్రమం అక్టోబర్ 15న ప్రారంభం కాగా.. నాటి నుండి చరిత్ర సాంస్కృతి సాంప్రదాయాలు పర్యాటకం కాకతీయుల చరిత్ర కాకతీయుల కన్స్ట్రక్షన్ టెక్నాలజీ ఇతర అంశాలపై లెక్చర్స్, ఫీల్డ్ ట్రిప్స్, తెలంగాణ పర్యాటక శాఖ తెలంగాణ ప్రభుత్వం సహకారంతో నిర్వహించడం జరుగుతున్నది. ప్రతీ రోజు వివిధ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతూనే ఉన్నాయి. కార్యక్రమంలో భాగంగా రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పుట, ప్రపంచ వారసత్వ సంరక్షణ కోసం స్వచ్ఛందంగా సేవ చేయుట ఈ కార్యక్రమం ఉద్దేశ్యం. ఈ నేపథ్యంలో పాలంపేటలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్పలో మూడవ వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ 2024 ట్రైనింగ్ ప్రోగ్రామ్, యువ టూరిజం క్లబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ 2024 ను ప్రారంభమైంది. ఈ కార్యక్రమం 26 అక్టోబర్ 2024 వరకు నిర్వహించడం జరుగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి యువ టూరిజం క్లబ్స్ తెలంగాణ స్టేట్ లోని వివిధ కాలేజీల నుండి స్టూడెంట్స్, వాలంటీర్స్ పాల్గొనడం జరిగింది. అదేవిధంగా ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజున భూపాలపల్లి జిల్లా రేగొండ మండల పరిధిలో గల పాండవల గుట్టను మరియు ఘనపూర్ మండల పరిధిలో గల కోటగుళ్లను సందర్శించడం జరిగింది. ఈ నేపథ్యంలో హాజరైన విద్యార్థులు, వాలంటీర్స్, డెలిగేట్స్ వ్యక్తిగత అనుభూతిని పొందినట్లు తెలిపారు.

### అప్పటి.. ఇప్పటి కాలానికి ఉన్న సంస్కృతి తెలుసుకున్న



కాకతీయ యూనిర్సిటీ లో మాస్టర్ ఆఫ్ టూరిజం చదువుతున్నాను. నేను భద్రాద్రి కొత్తగూడెం నుంచి వచ్చాను. వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ అండ్. యువ టూరిజం క్లబ్ వాలంటీర్ గా పార్టిసిపేట్ చేశాను. ఈ క్యాంప్ పాలంపేటలోని రామప్ప దేవాలయంలో జరుగుతుంది. 15 అక్టోబర్ అండ్ 26 వరకు ఇందులో భాగంగా ఉదయం పూట యోగ క్లాస్ జరుగుతుంది. యోగ వల్ల చాలా ప్రశాంతంగా ఉంటుంది అలాగే చాలా విషయాలు తెలుసుకున్నాను. అలాగే రామప్ప దేవాలయం మరియు పాండవుల గుట్ట గురించి తెలుసుకున్నాం. వాటి యొక్క ప్రత్యేకత మరియు కల్చర్ అప్పటి కాలంలో ఎలా వుండే వాళ్ళు పాండవులు మరియు కాకతీయులు కాలంలో నిర్మించిన రామప్ప దేవాలయాన్ని రామప్ప అనే శిల్పి చెక్కాడు అందుకు కారణం గా రామప్ప అనే పేరు రావడం అనేది జరిగింది. ఈ టెంపుల్స్ యొక్క ప్రత్యేకత మరియు ఆర్కిటెక్చర్, పేరిణి డ్యాన్స్, కళ్యాణమండపం, ఇంకా చాలా విషయాలు తెలుకోవడం అనేది జరిగింది.

- సర్ప. కావ్యశ్రీ మాస్టర్ ఆఫ్ టూరిజం కాకతీయ యూనిర్సిటీ. భద్రాద్రి కొత్తగూడెం

### పాండవుల గుట్ట రాక్ పెయింటింగ్లో తెలిసిన విషయాలేన్నో



నేను వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ క్యాంపు 2024 కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ అధర్యంలో రామప్పలో జరుగుతున్న క్యాంపుకి కేయూ పర్యాటక విభాగం నుండి రావడం జరిగింది. అదేవిధంగా ఆదివారం రోజున రామప్ప దేవాలయం నుండి పాండవుల గుట్ట మరియు గణపురం కోటగుళ్ళని సందర్శించము. అక్కడ రాక్ పెయింటింగ్ మరియు పాండవుల గుహల పట్ల చాల విషయాలు తెలుసుకున్నాను. ఈ క్యాంపు ద్వారా నాకు తెలియని విషయాలు చాలాతెలుసుకున్నాను. అదేవిధంగా భవిషత్తులో మరి ఇంకా ఎన్నో విషయాలు తెలుసుకుంటాను.

- కాడవేనా లక్ష్మణ్ మాస్టర్ అఫ్ టూరిజం కేయూ జయశంకర్ భూపాలపల్లి

### పర్యాటక రంగంలో అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను



నేను వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ 2024 క్యాంపులో భాగంగా రామప్ప దేవాలయానికి వచ్చాను. ఇక్కడ రోజువారి కార్యక్రమంలో భాగంగా ఉదయం యోగాతో మొదులుకుని రామప్ప దేవాలయం యొక్క కట్టడాలు, దాని వెనకాల ఉన్న చరిత్ర, సంస్కృతి, కాకతీయుల పరిపాలన విధానం, వారుచేసిన అభివృద్ధి, నీటికి ఇచ్చిన ప్రాముఖ్యతల గురించి ఎంతగానో తెలుసుకున్నాను. రామప్పదేవాలయం ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపుపోదడం చాలా సంతోషంగా ఉంది. దీనిని పర్యాటక రంగంలో అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను. ఇక్కడికి రావడం వలన నాకు తెలియని విషయాలుతెలుసుకోవాలి అని ఎంతో ఆసక్తి గా ఉంది.

- పూనెం ఝాన్సీ మాస్టర్ అఫ్ టూరిజం కేయూ, భద్రాద్రి కొత్తగూడెం

### భవిష్యత్ తరాలకు ఆదర్శం.. కాకతీయుల పాలనా విధానం



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నేను కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుండి 26 వరకి జరుగుతున్న వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ క్యాంపు 2024 లో పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా రామప్ప యొక్క గొప్పతనం, కాకతీయుల యొక్క పరిపాలన విధానం, వారు నిర్మించిన అద్భుతమైన కట్టడాలు, మరియు భవిషత్తు తరాలకి అందించిన వారసత్వ సంపద యొక్క గొప్పతనం గురించి ఇక్కడికి వచ్చాక మరెంతో తెలుసుకున్నాను. ఇందులో భాగంగా గణపురంలోని కోటగుళ్ళని మరియు పాండవుల గుట్టని ఆదివారం సందర్శించి అక్కడ నివసించిన పాండవుల యొక్క గుహలని మరియు మరియు వారు వదిలిన ఆనవాలని తెలుసుకోవడం జరిగింది. ఈ క్యాంపుకి రావడం వలన ఇప్పటివరకు కాకతీయుల గొప్పతనం మరియు పాండవులు ఎలా జీవనంకొనసాగించారు అనే విషయాలని తెలుసుకున్నాను. క్యాంపు ముగిసే వరకి ఇంకా తెలుసుకోవాలని చాలఆసక్తిగా ఉంది.

- రెడ్డి ప్రశాంత్ మాస్టర్ అఫ్ టూరిజం మేనేజ్మెంట్ ద్వితీయ సం. కాకతీయ యూనివర్సిటీవెంకటాపూర్, ములుగు జిల్లా

### దేశం నలుమూలల విస్తరింపచేయడమే క్యాంప్ ఉదేశ్యం



రామప్ప యూనెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ గా గుర్తించిన తర్వాత రామప్ప దేవాలయన్ని ప్రపంచానికి తెలియజేసే క్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ ప్రోగ్రాం యూనెస్కో ద్వారా అంగీకారం తీసుకుని గత మూడు సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం 40 మంది వాలంటీర్స్ ని దేశంలోని వివిధ ప్రాంతాలనుండి సెలెక్ట్ చేసి వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ ప్రోగ్రాం ని నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా రామప్ప దేవాలయంతో పాటు చుట్టుప్రక్కల ఉన్న ముఖ్యమైన ప్రదేశాలని వాలంటీర్స్ కి అవగాహనా కొరకై సందర్శించడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఆదివారం రోజున రేగొండ దగ్గరలో గల పాండవుల గుట్ట, మరియు గణపురంలోని కోటగుళ్ళని సందర్చించడం జరిగింది. దీని ద్వారా ఈ ప్రదేశాలలోని ప్రత్యేకమైన వారసత్వ సంపద గురించి వాలంటీర్స్ తెలుసుకుని వీటి యొక్క ప్రత్యేకతలని దేశం నలుమూలల విస్తరింపచేయాలనే దీని ఉదేశ్యం.

- జనగాం శ్రీధర్ రావు కోఆర్డినేటర్ వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్-2024

### ఉద్యమాలకి పెట్టింది పేరని తెలుసు.. చరిత్ర అద్భుతం



నా పేరు జ్ఞానకళ నేను బీబీఏ ట్రావెల్స్ అండ్ టూరిజం సిటీ కాలేజీ హైదరాబాద్ లో చదుతున్నాను. తెలంగాణ యొక్క ప్రత్యేకత గురించి నాకు ఎలాంటి అవగాహనా లేదు, ఉద్యమాలకి పెట్టింది పేరు అని మాత్రమే తెలుసు. నేను వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ గా వరంగల్ వచ్చిన తర్వాత రామప్ప గుడి యొక్క ప్రత్యేకత తెలుసుకున్నాను. నాకు తెలియని విషయాలని తెలుసుకుంటున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.

- జ్ఞానకళ బీబీఏ ట్రావెల్స్ అండ్ టూరిజం ఆంధ్రప్రదేశ్, నంద్యాల

### రామప్పకి వచ్చాకే.. తెలిసింది కాకతీయు పాలన చదివిన కన్నా.. చూసింది అద్భుతం



నా పేరు హరీష్ నేను మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ యూజిలో ఆర్కియోళోజి చేశాను. మా ఫ్రెండ్స్ లాస్ట్ ఇయర్లో తెలంగాణలోని రామప్ప దేవాలయంలో నిర్వహిస్తున్న కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ క్యాంపులో పాల్గొన్నారు. వారి సూచన మేరకు నేను రామప్పకి రావడం జరిగింది. రామప్పకి వచ్చిన తర్వాత కాకతీయులు రాజ్యాన్ని ఎలా అభివృద్ధి చేశారు, అని అందులో రామప్ప దేవాలయం యొక్క ప్రత్యేకతలైన స్యాండ్ బాక్స్ టెక్నాలజీ, ఫ్లోటింగ్ బ్రిక్స్, ఆర్ట్ అండ్ ఆర్చిటెక్చర్, పెయింటింగ్ వాటి యొక్క గొప్పతనాన్ని తెలుసుకున్నాను. ఇందులో భాగంగా ఆదివారం పాండవుల గుట్ట మరియు కోటగుళ్ళు సందర్శించి ఇక్కడ వారియొక్క ఆనవాళ్లు అయినా జింకలు, చేప, కప్ప, ఇలా చాల రకాలైన పెయింటింగ్స్ ని చూసాను.

- హరీష్ మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ (ఆర్కియోళోజి) తమిళనాడు, తిరువారుర్

### రామప్ప దేవాలయ కట్టడాలు కళాకృతిలో విభిన్నమైనవి



నేను వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ క్యాంపుకి రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ క్యాంపులో భాగంగా రామప్ప దేవాలయం యొక్క కళ, సంస్కృతిని తెలుసుకున్నాను. ఈ 12 రోజుల క్యాంపులో భాగంగా మాకు చెప్పిన తరగతుల ద్వారా రామప్ప దేవాలయం యొక్క కట్టడాలు, పర్యాటక అభివృద్ధి, కాకతీయుల చరిత్ర సంబంధించిన విషయాలను ఎంతగానో తెలుసుకున్నాను. ఇందులో భాగంగా ఆదివారం రోజున గణపురంలోని కోటగుళ్ళు మరియు రేగొండ సమీపంలోని పాండవుల గుట్టని సందర్శించము.

- వంటెపాక రాజేష్ మాస్టర్ అఫ్ టూరిజం కేయూ నల్గొండ